# రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలి




**విశ్వంభర, హైదరాబాదు:** కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేలా వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నిరుద్యోగ యువత హెచ్చరించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతను మోసం చేశారని వారు మండిపడ్డారు. బుధవారం నిరుద్యోగ జేఏసీ తెలంగాణ ఆధ్వర్యంలో "హలో నిరుద్యోగి -- ఛలో ఇందిరాపార్కు" కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ ప్రసన్న, తెలంగాణ ఉద్యమకారుడు విఠల్, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీ, తెలంగాణ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు, విద్యావేత్త అశోక్ తదితరులు హాజరయ్యారు. నిరుద్యోగ జేఏసీ నేత ఇంద్రానాయక్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో వక్తలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో అశోక్‌నగర్ చౌరస్తాలో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది నిరుద్యోగ యువతేనని, గ్లోబల్ సమ్మిట్‌లు, ఇతర కార్యక్రమాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా అదే నిధులను ఉపాధి కల్పనకు వినియోగించాల్సిందని వారు పేర్కొన్నారు. నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం హయాంలో కల్పించిన ఉద్యోగాలనే తమవి అని చెప్పుకోవడం సరికాదన్నారు. తక్షణమే రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, ఎస్ఐ, కానిస్టేబుల్, గురుకులాలు, అగ్రికల్చర్, ఫారెస్ట్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇతర శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



## మిర్యాలగూడ సీఎం సభకు ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల కేంద్రం నుంచి మిర్యాలగూడలో జరుగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశానికి త్రిపురారం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు డ్రిప్ వెంకట్ రెడ్డి, అనుముల అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లంపల్లి జానయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాజీ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్, మాజీ ఉపసర్పంచ్ పి.బి. శ్రీను, మాజీ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.బి. రవి, పడిశల రవి, చంటి, అంజిరెడ్డి, రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా ఆర్సి రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ సక్సెస్ మీట్



**విశ్వంభర, హైదరాబాదు:** ఇటీవల ఏపీపీఎస్సీ గ్రూప్--× ఫలితాల్లో సంస్థ విద్యార్థులు సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఆర్సి రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో సక్సెస్ మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ ఆర్.సి. రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర, దీప్తి పాల్గొన్నారు. గ్రూప్--×కు ఎంపికైన అధికారులు భారతాల ఉదయ్ శంకర్ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్), భగం నిఖిలశ్రీ (డిప్యూటీ కలెక్టర్), అడపాల ఓంకార్ వెంకట నాగేశ్వర రావు (డీఎస్పీ), నరహరిశెట్టి భానుప్రకాశ్ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్) తదితరులను ఆర్సి రెడ్డి అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్.సి. రెడ్డి మాట్లాడుతూ, "సివిల్స్, గ్రూప్--×, గ్రూప్--××ల్లో మా సంస్థ సాధిస్తున్న నిరంతర విజయాలు దశాబ్దాల అకడమిక్ కృషి ఫలితం" అన్నారు. సంఘమిత్ర మాట్లాడుతూ సంస్థ అకడమిక్ విధానాలను వివరించారు . తాజా గ్రూప్--× ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల్లో సుమారు 50 శాతం మంది ఆర్సి రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ విద్యార్థులే కావడం విశేషమని నిర్వాహకులు తెలిపారు.

## మహిళా న్యాయవాదిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** మోహినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది స్వప్న కుమారిని దారుణంగా హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్ డిమాండ్ చేశారు. బుధవారం న్యాయవాదులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నిందితుల్ని వెంటనే శిక్షించాలని, ప్రభుత్వం వెంటనే న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ,. కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి ఏ శేఖర్,.సీనియర్ న్యాయవాదులు గణేష్ గౌడ్, మధు గౌడ్,జగన్ గౌడ్, శిరీష్, శ్రీనివాస్, శ్రీశైలం, సర్దార్ నాయక్, మహేష్, ఆంజనేయులు,శిరీష, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధం కోసం వినతి



**విశ్వంభర, గుండాల:** గుండాల మండలం వేల్మజాల గ్రామంలో మహిళా సంఘాలు మద్యపాన నిషేధం కొరకు వెల్మజాల గ్రామ పంచాయతీ సర్పంచ్ కు కురిమిళ్ళ కవిత శ్రీనివాస్ కు వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో మద్యపాన నిషేధం, బెల్ట్ షాపుల రద్దు కోరుతూ విన్నవించారు. మద్యపానం వల్ల అనేక మంది కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోతున్నాయని అన్నారు . మద్యానికి బానిసలై పురుషులు సంపాదనను వృథా చేస్తున్నారని అన్నారు. అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపుల వల్ల మద్యం అందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చి, యువత చెడు మార్గం బారిన పడుతున్నారు. గ్రామ సర్పంచ్ హోదాలో ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామంలో మద్యపానాన్ని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు బొడ్డుపల్లి రేణుక, కార్యదర్శి సంగీ రజిత, కోశాధికారి మహేశ్వరి, వివో నేరేటి జయమ్మ, శ్రీలత మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## సర్పంచి కృషితో నియత్రికకు మరమ్మతులు

- అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ బహూకరణ

**విశ్వంభర,నెల్లికుదురు:** మండలంలోని హనుమాన్ నగర్ తండా(తారాసింగ్ బావి) సర్పంచి గుగులోతు అశోక్ పాడైపోయిన ట్రాన్స్ఫార్మర్ను సొంత నిధులతో రిపేర్ చేయించారు. దీంతో జిపి పరిధిలోని కీమా నాయక్ తండా ప్రజల గృహాలకు విద్యుత్ సరఫరా కావడంతో తండావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తండాలోని అంగన్వాడి కేంద్రంలో ఫ్యాన్ లేకపోవడంతో చిన్నపిల్లలు ఇబ్బంది పడటం చూసిన సర్పంచి వెంటనే కొత్త సీలింగ్ ఫ్యాన్ కొని సెంటర్ టీచర్ శారదకు అందజేశారు. 4వ వార్డు సభ్యులు అజ్మీర సోమ్లు కరెంట్ కనెక్షన్ కోసం సర్వీస్ వైరు బహుకరించారు.



ఈ సందర్భంగా సర్పంచి అశోక్ మాట్లాడుతూ గత కొంత కాలంగా కీమా నాయక్ తండా లో ట్రాన్స్ఫార్మర్ రిపేరుకు నోచుకోక మూల పడిపోవ డంతో తండావాసుల ఇబ్బందిని గమనించి మరమ్మతు చేయించి ఫిటింగ్ చేయించామన్నారు. కార్యక్రమంలో వెం కన్న నాయక్ ,శంకర్, వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు.



## వార్డు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం"

**విశ్వంభర,సూర్యాపేట:** సూర్యాపేట పట్టణంలోని 39వ వార్డులో బుధవారం గడ్డం భాగ్యలక్ష్మి వెంకన్న ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి టీచర్ ఉద్యోగానికి స్వస్తి పలికి అనేక సేవా కార్యక్రమాలు చేశానని అన్నారు . వార్డు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని ముందుకు వస్తున్నామని అన్నారు .మంచినీటి సమస్య,డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య వంటి మౌలిక వసతులు కల్పిస్తానన్నారు . వార్డు ప్రజలందరూ ఆశీర్వదించి చెయ్యి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు .

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ రహీం,నాంపల్లి శ్రీను, గడ్డం చంద్రశేఖర్,బాణాల రాము,గొట్టిపర్తి సాయి ప్రసాద్, లతీఫ్, సయ్యద్, బీబీ రెడ్డి పవన్, అబ్దుల్ అన్సారి, సిరజ్,సంతోష్, చందు,అన్నపూర్ణ, భాగ్యామనీ, సరస్వతిభట్ల, లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

## తెలంగాణకు నిధులు ఇవ్వడంలో కేంద్రం విఫలం: రాము గౌడ్




**విశ్వంభర, హిమయత్‌నగర్ :** "తెలంగాణ నుంచి వేల కోట్ల పన్నులు వసూలు చేసి, రాష్ట్రానికి రావాల్సిన నిధులను కావాలనే ఆపేస్తోంది. ఇది స్పష్టమైన తెలంగాణ వ్యతిరేక వైఖరి," అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ ఆరోపించారు. బుధవారం హిమయత్‌నగర్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, హైదరాబాదు మెట్రో ఫేజ్--2 వంటి హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు పరీక్షన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ 35వ వార్డు కౌన్సిలర్ ఏకగ్రీవం

- యెర్నేని కుసుమ వెంకటరత్నం బాబుకు అభినందనలు



**విశ్వంభర, కోదాడ :** కోదాడ మున్సిపాలిటీ 35 వ వార్డు కౌన్సిలర్ గా యెర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. వాయిలసింగవరం గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. యెర్నేని కుసుమ వెంకటరత్నం బాబు నాయకత్వంలో కోదాడ నియోజకవర్గం శాసనసభ్యురాలు నలమాల ఉత్తమ్ పద్మావతి రెడ్డి నేతృత్వంలో కోదాడ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆకాక్షించారు. .ఈ కార్యక్రమంలో కొల్లు సుబ్బారావు, గుండ్లపల్లి వెంకన్న, దాములూరి మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వసతులతో ఫంక్షన్ హాల్ నిర్మాణం:ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ లో రూ. 4 కోట్లతో నిర్మిస్తున్న గోకుల్ ఫంక్షన్ హాల్ పనులు పూర్తయ్యాయని.. అతి త్వరలో ప్రారంభించబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం గోకుల్ నగర్ లో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆధునిక వసతులు.. విశాలమైన గదులతో ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాళ్లు నిర్మించాలన్న లక్ష్యంతో నియోజకవర్గం వ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కుల పెద్దలు, స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి అతి త్వరలో ఫంక్షన్ హాల్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, యాదవ సంఘం ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్, రాజన్ సింగ్, జిహెచ్ఎంసి ఏఈ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు





**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వృద్ధ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించినట్లు మేడ్చల్ డివిజన్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి తెలిపారు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. దుండిగల్ లోని చర్చి గాగిలల్ల పూర్‌కు చెందిన చిన్నబత్తిని సుశీలమ్మ (85) ఒంటరిగా నివాసం ఉంటుందని తెలిపారు. నిందితురాలు పి. కవిత (36), అదే గ్రామానికి చెందిన వ్యక్తి కాగా.. గతంలో సుశీలమ్మ వద్ద 15 రోజుల పాటు మేస్త్రీ పని చేసినట్లు వెల్లడించారు. 2026 ఫిబ్రవరి 2వ తేదీ మధ్యాహ్నం సుశీలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు కవిత బండరాయితో తలపై మోది హత్య చేసింది. అనంతరం సుశీలమ్మ వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలు, చేతి వేలి ఉంగరాన్ని దొంగిలించి పరారైనట్లు ఏసీపీ వివరించారు. సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని గుర్తించి ఈ నెల 3వ తేదీన రాత్రి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితురాలి వద్ద నుంచి జత బంగారు చెవికమ్మలు, బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. దుండిగల్ పోలీస్, సీసీఎస్, ఎస్ఓటీ పోలీసులు బృందాలు గా ఏర్పడి కేసును ఛేదించారని చెప్పారు. ఈ కేసు దర్యాప్తు లో కీలకంగా మారిన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన చర్చి గాగిలాపూర్‌కు చెందిన శ్రీకర్ రెడ్డి ని సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కేసును మేడ్చల్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో దుండిగల్ పోలీస్, సీసీఎస్, ఎస్ఓటీ బృందాలు తక్కువ సమయంలో ఛేదించారు. సీసీఎస్ ఏసీపీ వై. నాగేశ్వరరావు, పీ. సతీష్ (దుండిగల్ ఇన్‌స్పెక్టర్), ఎం. బాలరెడ్డి (దుండిగల్ డీఐ), పీ. దాలి నాయుడు (మేడ్చల్ సీసీఎస్ ఎస్ఐ), టి. శంకర్ (మేడ్చల్ సీసీఎస్ ఎస్ఐ), డీఎన్ ఈశ్వర్ (దుండిగల్ ఎస్ఐ) సమష్టిగా దర్యాప్తు చేశారు.

## గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే సీఎం కప్ లక్ష్యం

### పటాన్చెరులో ప్రారంభమైన నియోజకవర్గస్థాయి క్రీడలు



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో గల పాఠశాలల స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి.. వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ పటాన్చెరు నియోజకవర్గస్థాయి క్రీడలను క్రీడాజ్యోతి వెలిగించి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతహాగా క్రీడాకారుడైన తాను క్రీడల అభివృద్ధికి అనునిత్యం అండగా నిలుస్తూ వారు అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నానని తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం వివిధ క్రీడా అంశాలలో మైత్రి మైదానం వేదికగా జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని మండల స్థాయి క్రీడల్లో ఎంపికైన 400 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సిఐ వినాయక రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు నాయక్, రాములు, సుధాకర్, విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## పటాన్చెరు డివిజన్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు అభివృద్ధిలో అందరిని భాగస్వాములను చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ, ఎంజీ రోడ్డు, నందన్ రతన్ ప్రైడ్ కాలనీలలో రూ. 1.21 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు. వరద నీటి తరలింపు, డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒకరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్లు, యుజిడీలు, పార్కులతోపాటు కమ్యూనిటీ హాళ్లు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పృథ్వీరాజ్, వెంకటేష్, పట్టణ పుర ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**విశ్వంభర,నిజామాబాద్ :** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముద్రణ జరిపించాలని, పోలీసు భద్రత మధ్యన స్ట్రాంగ్ రూమ్ లకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తయిన మీదట వివరాలు ఎక్కడ కూడా బయటకు వెల్లడి కాకుండా చూడాలని, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ముద్రణ అనంతరం సాఫ్ట్ కాపీలను పూర్తిస్థాయిలో హార్డ్ డిస్క్ నుండి కూడా తొలగించేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు చేపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాలెట్ పత్రాల ముద్రణ విషయంలో ఎంతో అప్రమత్తతో వ్యవహరించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో కనీస సదుపాయాలను మరోమారు క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనంగా పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. పోలింగ్ ముగిసిన వెంటనే గట్టి బందోబస్తు మధ్యన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ సెంటర్ కు తరలించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.